పేదల ఆరోగ్యానికి పెద్దపీట

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని సెంట్రల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు అన్నారు. . గిరిపురంలోని బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత, డీఎం హెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసినిలతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధితో పాటు పేదల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలున్న వారికి నయమయ్యే వరకు తోడుగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం దేశంలో వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. 24వ డివిజన్‌లోని 92 వ వార్డు సచివాలయ పరిధిలో 958 ఇళ్లను సర్వే ద్వారా ఆరోగ్య సిబ్బంది సందర్శించినట్లు తెలిపారు. 2,685 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 506 మందికి టోకెన్లు అందజేసినట్లు వెల్లడించారు. వీరందరికీ 5 దశల్లో ఉచితంగా ఆరోగ్య సేవలు అందించడంతో పాటు వ్యాధి నయం అయ్యేంత వరకు సరిపడా మందులు పూర్తి ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ సేవలు ప్రజలందరి హక్కుగా ఈ ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. మరోవైపు నియోజకవర్గంలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో వారంలో రెండు రోజులు సోమ, గురు వారాల్లో ఉదయం 8 గంటలలోపు షుగర్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యం విషయంలో అలసత్వం, ఆలస్యం తగదని.. ఏ మాత్రం అనారోగ్య లక్షణాలు కనిపించినా వెనకడుగు వేయకుండా వైద్య పరీక్షలు చేయించుకుని ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య రంగంలో సరికొత్త ఒరవడి

మధురానగర్(విజయవాడసెంట్రల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య రంగంలో సరికొత్త ఒరవడి అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రామకృష్ణాపురంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని, కార్పొరేటర్ బీహెచ్ఎస్వీ జానారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన వారితో మాట్లాడి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ పేదలకు మెరుగైన ఆరోగ్యం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులను సైతం పరిష్కరించే దిశగా అనుభవం ఉన్న వైద్యులతో ప్రజలకు చికిత్స అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పూర్తిస్థాయిలో అన్ని రకాల పరీక్షలు చేసి.. ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 6,729 మంది ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగపరచుకోగా.. వీరందరికీ 5,824 టెస్టులు, 2,021 మందికి కంటి పరీక్షలు, 715 మందికి ఈసీజీ టెస్టులు నిర్వహించినట్లు వెల్లడించారు. వీరిలో 715 మందిని మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 30వ డివిజన్లోని 246 వ వార్డు సచివాలయ పరిధిలో 1,243 గృహాలను ఇంటింటీ సర్వే ద్వారా ఆరోగ్య సిబ్బంది సందర్శించినట్లు తెలిపారు. 3,064 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 550 మందికి టోకెన్లు అందజేసినట్లు వివరించారు. మరోవైపు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వ్యవస్థ పట్ల ప్రజలందరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుదారుల సౌలభ్యం కోసం ఓ మొబైల్ యాప్‌ను సైతం రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అర్ధరాత్రి వేళల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలు సద్వినియోగపరచుకునేలా.. ముగ్గురు పర్యవేక్షకులను ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిందన్నారు. అలాగే రామకృష్ణాపురం ప్రజలకు మూడు వైపులా దేవీనగర్, అయోధ్యనగర్, ఇందిరా నాయక్ నగర్‌లో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రారంభించుకున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందులు, కిట్ అందచేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని తదితరులు



మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

క్లుప్తంగా

అందరికీ కనకదుర్గమ్మ ఆశీస్సులు



పాయకాపురం(విజయవాడరూరల్): కనకదుర్గమ్మ ఆశీస్సులు అందరికీ ఉండాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. 61వ డివిజన్ వాంబేకాలనీ హెచ్‌బ్లాక్ 14 వద్ద స్థానికులు నిర్వహించిన అమ్మవారి అన్నసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. తొలుత అమ్మవారికి కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి వెంకట్రావ్‌తో కలిసి పూజలు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, అలంపూరు విజయ్, ఆర్ఎస్ నాయుడు, దుర్గాప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

భక్తిగా సాగిన శోభాయాత్ర



విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరి, శారదాంబ, మహాలక్ష్మి అమ్మవార్లను నిజరూపంలో భక్తి యాత్రను నిర్వహించారు. సత్యానారాయణపురం, బీఆర్‌టీఎస్ రోడ్డుమీదుగా దేవాలయం ప్రాంగణానికి చేరుకుంది. వీరుభొట్ల లక్ష్మీకుమార శర్మ, కూచిభొట్ల పండు దేవాలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజీకండ్రికలో అనారోగ్యం కారణంగా మృతి చెందిన దేశబోయిన నాగేశ్వరావు కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తాత్కాలిక సహాయం రూ.10 వేలను వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నగర ప్రధాన కార్యదర్శి యరగొర్ల శ్రీరాములు బుధవారం అందచేశారు. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం నుంచి రాగానే అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ బాల నాగరాజు, వెల్ఫేర్ సెక్రటరీ శివ, హెల్త్ సెక్రటరీ మోబీనా, సచివాలయ కన్వీనర్ పెద్దిబోయిన విజయనిర్మల, ఆశావర్కర్ శ్రీదేవి, వలంటీరు ఫర్హానా పాల్గొన్నారు.

ఎఫ్ఎల్‌సీ పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

– ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సీ) పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి వారం నిర్వహించే రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో భాగంగా గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం గోడౌన్‌లో ఎఫ్ఎల్‌సీ ప్రక్రియపై బుధవారం వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటి వరకు 1,605 బ్యాలెట్ యూనిట్లు, 1605 కంట్రోల్ యూనిట్లు, 1,695 వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ పూర్తి చేశామని చెప్పారు. ఈ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తున్నామన్నారు. చెకింగ్ నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు 285 యూనిట్ల చొప్పున 20 రోజుల పాటు 5,700 పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నామని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో ఢీ కొని బాలుడికి గాయాలు

చిట్టినగర్: ఆటో ఢీ కొనడంతో బాలుడికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఖుందరయ్యనగర్‌కు చెందిన జయసూర్య 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం వైవీఆర్ చికెన్ షాపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వేగంగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. దీంతో జయసూర్యకు గాయాలు కాగా, తిరిగి ఆటో డ్రైవర్ జయసూర్యను దూషించాడు. దీంతో స్థానికులు జయసూర్య అన్నయ్యకు ఫోన్ చేయడంతో హుటాహుటిన బీఆర్‌టీఎస్ రోడ్డులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



గద్దే వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



అయోధ్యనగర్‌లో అమ్మవారి ఊరేగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో బుధవారం నగరోత్సవం కనులపండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అమ్మవారిని ఉంచి మేళ తాళాలు డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ నృత్యాలతో ఊరేగింపు ఉత్సాహంగా జరిగింది. దారి పొడవునా భక్తులు అమ్మవారికి హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. గద్దే వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పురవీధుల్లో ఊరేగించారు. గద్దే శ్రీను, నూతక్కి శ్రీను, కొండా మహలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారిని హంసవాహనంపై ఊరేగించారు. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది.

మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డు, మధురానగర్ రమాదేవి నగర పాలక సంస్థ పాఠశాల సమీపంలో అన్నదానం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీల దీక్ష విరమణ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన భక్తులు, యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పుష్కర్ ఘాట్, సీతమ్మవారి పాదాలు ప్రాంతంలో పర్యటిస్తూ ఘాట్ వద్ద యాత్రికులు స్నానం చేసేందుకు గల సదుపాయాలు, కేశఖండనశాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా ప్రాంత పరిసరాలన్నీ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవానీల దీక్ష విరమణ సమయంలో వారు వదిలేసే వస్త్రాలను ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన కన్వేయర్ బెల్ట్ ద్వారా తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఘాట్ల వద్ద మెరుగైన పారిశుద్ధ్య పరిస్థితులను నెలకొల్పి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. యాత్రికులకు అందుబాటులో ఉంచిన తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ పర్యటనలో సీఎంఓహెచ్ డాక్టర్ రత్నావళి, హెల్త్ ఆఫీసర్–3 ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పుష్కర్ ఘాట్ వద్ద పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సుందరంగా సింగ్‌నగర్ ఖబర్‌స్థాన్

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సుదీర్ఘకాలంగా సమస్యలకు నిలయంగా మారిన సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌రోడ్డు నుంచి వాంబేకాలనీకి వెళ్లే దారిలో ఉన్న ఖబర్‌స్థాన్‌ను రంజాన్ నాటికి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా తెలిపారు. కార్పొరేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ఉద్యానవన శాఖ అధికారులు, స్థానిక ముస్లిం మత పెద్దలతో కలసి ఖబర్‌స్థాన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రుహుల్లా మాట్లాడుతూ సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లో సుమారు 6 నుంచి 7 వేల ముస్లిం కుటుంబాలు నివసిస్తున్నాయని చెప్పారు. వీరందరికి ఈ ఖబర్‌స్థాన్ అందుబాటులో ఉంటుందన్నారు. సింగ్‌నగర్‌లోని 15 మస్జిద్ కమిటీల పెద్దలు ఈ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్, కలెక్టర్‌తో మాట్లాడామని తెలిపారు. ఖబర్‌స్థాన్ వెనుక భాగంలో ప్రహరీ, ముందు భాగంలో మస్జిద్ నిర్మాణ పనులు, అవసరమైన చోట అంతర్గత రోడ్లు, లైట్లు ఏర్పాటు చేయడానికి అంచనాలు రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఖబర్‌స్థాన్ ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలు నిండి ఉండడంతో వెంటనే తొలగించాలని ఉద్యానవన శాఖ సిబ్బందికి సూచించారు. రంజాన్ పండుగ నాటికి అన్ని హంగులతో సిద్ధం చేసి అందుబాటులోకి తెస్తామని రుహుల్లా పేర్కొన్నారు.



చేపట్టాల్సిన పనులను అధికారులకు సూచిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, పక్కన ముస్లిం మత పెద్దలు

వన్‌టౌన్ పీఎస్‌లో శాస్త్రోక్తంగా చండీహోమం



అన్నదానం చేస్తున్న సీపీ టీకే రాణా, పోలీసు అధికారులు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి, సీపీ రాణా, డీసీపీ విశాల్‌గున్ని, ఈవో రామారావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో బుధవారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా ఉత్సవాల సందర్భంగా స్టేషన్ ప్రాంగణంలో కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ముగింపు సందర్భంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా పలువురు ఐపీఎస్ అధికారులు స్వయంగా హాజరై పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయుధ పూజలు, అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా పోలీసు కమిషనర్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీపీ, పోలీసు కుటుంబాలు, వేలాది మంది పేదలు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఎమ్మెల్యే వెలంపల్లి, సీపీ రాణా, నగరంలోని జాయింట్ సీపీ, డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, అధికారులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక సీఐ సురేష్‌రెడ్డి, ఏసీపీ కే హనుమంతరావులు కార్యక్రమాలను నిర్వహించారు. ఏఐజీ రవీంద్రబాబు, డీసీపీ విశాల్‌గున్ని, ఏడీసీపీలు సీహెచ్ లక్ష్మీపతి, పి.వెంకటరత్నం, ఆలయ ఈవో కేఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేశారు : సీపీ

అన్ని శాఖల సమన్వయంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేశామని సీపీ టీకే రాణా అన్నారు. పూజల అనంతరం ఆయన సిబ్బందిని అభినందించారు. దసరా వేడుకలకు సుమారు 15 లక్షల మంది భక్తులు తరలివచ్చారని చెప్పారు. 11 రోజుల పాటు రద్దీ కొనసాగిందన్నారు. 3 వేల మంది సిబ్బందితో తమ శాఖ బందోబస్తు చేపట్టిందని వివరించారు. అనంతరం వన్‌టౌన్ పోలీసుసిబ్బందితో పాటుగా అధికారులతో కలిసి ఫొటో దిగారు.

పోలీసు శాఖ సేవలు అభినందనీయం : వెలంపల్లి

దుర్గమ్మ దసరా వేడుకల్లో పోలీసు శాఖ చక్కని సేవలందించిందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. అధికారులందరూ సమన్వయంతో పని చేశారన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవదాయ, పోలీసు, రెవెన్యూ ఇతర శాఖలు సమన్వయంతో ముందుకు సాగాయన్నారు. అలాగే తిరుమల తిరుపతి ఉత్సవాల స్థాయిలో ఈ ఏడాది దసరా ఉత్సవాలు జరిగాయని, విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట సుబ్రహ్మణ్య స్వామి వారి గుడి ప్రాంతానికి చెందిన గంప ప్రభు చేపల మార్కెట్‌లో కోళ్ల వ్యాన్‌లో పని చేస్తుంటాడు. మంగళవారం రాత్రి ప్రభు, బుడ్డా ఏసు అనే వ్యక్తి కలిసి మద్యం తాగే సమయంలో గొడవ జరిగింది. బుధవారం మధ్యాహ్నం చేపల మార్కెట్ వద్ద ఉన్న ప్రభుతో ఏసు మళ్లీ గొడవ పడ్డాడు. ఆ సమయంలో చికెన్ షాపులో ఉన్న కత్తి తీసుకున్న ఏసు, ప్రభుపై దాడి చేయబోయాడు. దీంతో ప్రభు తన ఎడమ చేయిని అడ్డు పెట్టగా, చేతిపై గాయమైంది. గాయపడిన ప్రభు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తుది దశకు అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరం నడిబొడ్డున అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో నగరంలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం కమిషనర్ అధికారులతో కలిసి అంబేడ్కర్ స్మృతివనాన్ని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న మ్యూజియం, సీలింగ్, ప్లాస్టింగ్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని చేయాలని ఆదేశించారు. ఇప్పటికే 95 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు.

● కాపాడమ్మా.. దుర్గమ్మ



ఇంద్రకీలాద్రిపై భవానీల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భవానీలు, భక్తులతో బుధవారం ఇంద్రకీలాద్రి భక్తజనకీలాద్రిగా మారింది. భవానీలు అమ్మవారిని దర్శించుకుని మాల విరమణ చేశారు. కాపాడమ్మా.. దుర్గమ్మ అంటూ ప్రార్థించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









జగనన్నతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' పేరుతో ముద్రించిన పోస్టర్‌లను బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మంచి పనులను ప్రజలలోకి తీసుకెళ్లేందుకు, రాష్ట్రానికి జగనన్న మరోమారు సీఎం కావాల్సిన ఆవశ్యకతను తెలియ చేసేందుకు తాము వై ఏపీ నీడ్స్ జగన్ పేరిట నగరంలో పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత 52 నెలల నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని చెప్పారు. 61 డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, అన్నపురెడ్డి రామిరెడ్డి, ముత్యాలకన్న, పట్నాల సత్య, కోలా పవన్ కుమార్, డి.రమేష్ డి.నాగేంద్ర, హనుమాన్, పి.కేశవ, ఎం. మహేంద్ర దాసరి భరద్వాజ్, దేవళ్ళ అశోక్, కే ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



'వై ఏపీ నీడ్స్ జగన్' పేరుతో ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తోట శ్రీనివాస్

అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. బావాజీపేట నాలుగోలైనులో బుధవారం శ్రీదేవీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యాన శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు బచ్చుమాధవీ కృష్ణ ఆధ్వర్యాన శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అన్నప్రసాద వితరణ జరిగింది. అవినాష్ ముఖ్య అతిథిగా పాల్గొని భోజనాలు వడ్డించారు. ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న బచ్చు మాధవీ మురళీకృష్ణను అభినందించారు. నాలుగువేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. అనంతరం అమ్మవారి అలంకరణ చీరలను వేలం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



భోజనాలు వడ్డిస్తున్న దేవినేని అవినాష్, బెల్లం దుర్గ

అష్టాదశభుజ కనకదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో బుధవారం అష్టాదశభుజ కనకదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. వైఎస్సార్ సీపీ 26వ డివిజన్ ఇన్‌చార్జి, సెంట్రల్ నియోజకవర్గం యాదవ సంఘం అధ్యక్షులు అంగిరేకుల నాగేశ్వరరావు, గొల్లభామ దంపతులు 108 బిందెలతో జలాభిషేకం, ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమం నిర్వహించి వేదపండితుల మంత్రోచ్చారణలతో విగ్రహ ప్రతిష్ట జరిపించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రతీ ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

